సాక్షి శ్రీసత్యసాయి జిల్లా

బుధవారం । 31 । జూలై । 2024



టన్ను చీనీ రూ.16,500

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో మంగళవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16,500 పలికాయి. మార్కెట్‌కు 680 టన్నుల చీనీ కాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.30

అనంతపురం శివారు కక్కలపల్లి మండీలో మంగళవారం కిలో టమాట గరిష్టంగా రూ.30, కనిష్టంగా రూ.13 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
33.7°/22.9°

జిల్లా పరిధిలో మంగళవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. గంటకు 8 నుంచి 14 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

ఖాద్రీశుని హుండీ ఆదాయం రూ.90.73 లక్షలు



హుండీ కానుకలను లెక్కిస్తున్న దృశ్యం

కదిరి టౌన్: ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామికి భక్తులు హుండీల ద్వారా సమర్పించిన కానుకలను మంగళవారం ఆలయ, బ్యాంక్ అధికారులు లెక్కించారు. 66 రోజులకు గాను రూ.90,73,407 ఆదాయం వచ్చినట్లు ఆలయ ఈఓ వి.శ్రీనివాసరెడ్డి తెలిపారు. అలాగే 23.855 గ్రాముల బంగారం, 310 గ్రాముల వెండి, 43 అమెరికా డాలర్లు, ఒక సౌది రియాల్, ఒక కువైట్ దినార్ హుండీల ద్వారా భక్తులు శ్రీవారికి సమర్పించినట్లు ఆయన వెల్లడించారు. గతంతో పోలిస్తే ఈ సారి ఆదాయం పెరిగిందన్నారు. కార్యక్రమంలో హుండీల పర్యవేక్షణాధికారి రమేష్‌బాబు, స్టేట్ బ్యాంక్ మేనేజర్ బి.హరిప్రసాద్, బ్యాంక్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

నర్సాపూర్-ధర్మవరం ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీలు

గుంతకల్లు: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా ఆగస్టు 1 నుంచి 31 వరకూ నర్సాపూర్-ధర్మవరం మధ్య నడుస్తున్న ఎక్స్‌ప్రెస్‌కు అదనపు బోగీలను ఏర్పాటు చేస్తున్నట్లు చీఫ్ పబ్లిక్ రిలేషన్ ఆఫీసర్ ఏ.శ్రీధర్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఓ ప్రకటన విడుదల చేశారు. నర్సాపూర్-ధర్మవరం (17247/48) ఎక్స్‌ప్రెస్ రైళ్లకు ఫస్ట్ క్లాస్-1, టూటైర్-1 అదనపు బోగీలను జత చేస్తున్నట్లు తెలిపారు. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

నాణ్యమైన విద్య బోధించండి

- ఏపీఆర్ఎస్‌ను తనిఖీ చేసిన మంత్రి సవిత



ఏపీఆర్ఎస్‌లో విద్యార్థులతో మాట్లాడుతున్న మంత్రి సవిత

పరిగి: విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధనతో పాటు పౌష్టికాహారం అందించాలని రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవిత ఆదేశించారు. మంగళవారం ఆమె మండలంలో విస్తృతంగా పర్యటించారు. తొలుత ఏపీఆర్ఎస్ కొడిగెనహళ్లి పాఠశాలకు వెళ్లారు. డార్మెటరీ, తరగతి గదులు, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి పలు అంశాలపై చర్చించారు. ఏవైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. అనంతరం సమస్యల గురించి ప్రిన్సిపాల్ మురళీధర్‌బాబును మంత్రి ఆరా తీశారు. తగినంత మంది టీచర్లు, తరగతి గదులు లేవని, టీచర్ల కొరత నివారించేందుకు గెస్ట్ టీచర్లను నియమించాలని మంత్రిని ప్రిన్సిపాల్ కోరారు. అనంతరం మంత్రి సవిత పెద్దిరెడ్డిపల్లిలో మారెమ్మ ఆలయంలో పూజలు చేశారు. శ్రీరంగరాజుపల్లిలో దండు మారెమ్మకు జ్యోతులు సమర్పించారు.

చీర మెరుపు.. విక్రయాల విరుపు

ధర్మవరం పట్టు చీరల మార్కెట్‌కు దేశంలోనే పేరుగాంచింది. నిత్యం వ్యాపారులు, కొనుగోలుదారులతో కిటకిటలాడుతూ ఉండేది. కానీ నేడు కొనుగోలుదారులు లేక వెలవెలబోతోంది. శుక్రమూఢ్యం, ఆషాఢం వల్ల శుభకార్యాలు లేకపోవడంతో పట్టు చీరల అమ్మకాలు మందగించాయి. ధర్మవరంలోని నేసేపేటలో ఏషాపులో చూసినా పట్టుచీరల నిల్వలు పేరుకుపోయాయి. దీంతో వ్యాపారులు శ్రావణం, మాఘమాసంలో జరిగే శుభకార్యాలపైనే ఆశలు పెట్టుకున్నారు.



పట్టుచీరల దుకాణంలో పేరుకుపోయిన నిల్వలు

- శుక్రమూఢ్యం, ఆషాఢం ఎఫెక్ట్
- కుదేలైన పట్టుచీరల వ్యాపారం
- ఇబ్బందులు పడుతున్న వ్యాపారులు
- శ్రావణ మాసం, పెళ్లిళ్ల సీజన్‌పైనే ఆశలు





ధర్మవరం: పట్టుచీరలు మిలమిల మెరిసిపోతున్నా... కొనుగోలుదారులు లేక దుకాణాలు వెలవెలబోతున్నాయి. ధర్మవరంలోని నేసేపేటలో 1,650 పట్టుచీరల దుకాణాలు (సిల్క్‌హౌస్‌లు) ఉండగా.. మూడు నెలలుగా ఎక్కడా చెప్పుకోదగ్గ వ్యాపారం జరగడం లేదు. ఇతర రాష్ట్రాల వ్యాపారులూ అన్‌సీజన్‌లో ధర్మవరానికి రాకపోవడంతో అనుబంధ రంగాల్లోని వారికీ ఉపాధి కరువైంది.

ముహూర్తాల సీజన్‌లో దేశ విదేశాలకు ఎగుమతులు

ధర్మవరం సిల్క్‌హౌస్‌ల యజమానులు కావాల్సిన డిజైన్లలో చీరలు నేయించుకుంటారు. ఇందుకోసం చేనేత కేంద్రాలైన ధర్మవరం, హిందూపురం, సోమందేపల్లి, కోటంక, గోరంట్ల, సిండికేట్ నగర్, యాడికి, అన్నమయ్య జిల్లా మదనపల్లె తదితర ప్రాంతాలలోని చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్లపై ఆధారపడతారు. చేనేత మగ్గంపై తయారైన పట్టుచీరలు రూ.5 వేల నుంచి రూ.లక్ష , రూ.2 లక్షల వరకు ధర ఉంటాయి. ఈ చీరలను దేశంలోని వివిధ పట్టణాలు, నగరాల్లోని పట్టుచీరల షోరూంలకు హోల్‌సేల్‌గా అమ్ముతారు. అలాగే కేరళ, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ,మధ్యప్రదేశ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాల వ్యాపారులూ ధర్మవరానికి వచ్చి పట్టు మార్కెట్‌లోని సిల్క్ షాపుల్లో హోల్‌సేల్‌గా పట్టుచీరలను కొనుగోలు చేస్తారు. మరికొన్ని షాపుల యజమానులు ప్రత్యేకంగా నేసిన చీరలను దుబాయ్, అమెరికా తదితర దేశాలకు సైతం పట్టుచీరలను ఎగుమతులు చేస్తుండటం విశేషం. ముహూర్తాల సీజన్‌లో ధర్మవరం మార్కెట్‌లో చీరల విక్రయాలు జోరుగా సాగుతాయి.

మందకొడిగా విక్రయాలు

ధర్మవరం సిల్క్ మార్కెట్‌లో 3 నెలలుగా పట్టు చీరల విక్రయాలు ఆశించినస్థాయిలో జరగడం లేదు. శుభకార్యాలకు మంచి ముహూర్తాలు లేకపోవడం, శుక్రమూఢ్యం, ఆషాఢమాసం కారణంగా పట్టు చీరల విక్రయాలు బాగా తగ్గిపోయాయి. సీజన్‌లో ప్రతివారం రూ.21 కోట్లకుపైగానే లావాదేవీలు జరిగేవని అంచనా వేయగా, ప్రస్తుతం రూ.5 కోట్ల వ్యాపారం కూడా జరగడం లేదని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఫలితంగా పట్టు చీరలన్నీ స్టాక్ పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దీంతో సమయానికి కార్మికులు డబ్బులు ఇవ్వలేని పరిస్థితి నెలకొందని చెబుతున్నారు.



నిర్మానుష్యంగా దర్శనమిస్తున్న ధర్మవరంలోని నేసేపేట

నగదు అమ్మకాలకే ప్రాధాన్యం

సీజన్‌లో అయితే ఇక్కడి వ్యాపారులు దేశంలోని వివిధ నగరాల్లోని షోరూంలకు చీరలు అప్పుగా ఇచ్చేవారు. సరుకు పంపిన రెండు మూడు నెలల తర్వాత సదరు షోరూంల నిర్వాహకులు డబ్బులు చెల్లించేవారు. అయితే వ్యాపారం సరిగా లేకపోవడం...ప్రఖ్యాతిగాంచిన షోరూంల యజమానులూ డబ్బులు ఎగవేతకు పాల్పడుతుండటంతో నగదు వ్యాపారానికే సిల్క్ షాపు యజమానులు మొగ్గు చూపుతున్నారు.

ముహూర్తాల సీజన్‌పైనే ఆశ

రానున్న శ్రావణం, మాఘమాసం, దసరా, దీపావళి పండుగలపై వ్యాపారులు ఆశపెట్టుకున్నారు. ఎప్పటిలాగే ఈ సీజన్‌లో పట్టుచీరల విక్రయాలు జోరందుకుంటాయని అంచనా వేస్తున్నారు. దీనికి తోడు ఈ ఏడాది పంటలు బాగా పండితేనే పట్టుచీరల వ్యాపారం గాడిలో పడే అవకాశం ఉంది. అయితే ఇప్పటికే తీవ్ర వర్షాభావ పరిస్థితులు కనిపిస్తుండటంతో వ్యాపార వర్గాల్లో తీవ్ర ఆందోళన మొదలైంది.

మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలి



అన్‌సీజన్ వల్ల మూడు నెలలుగా పట్టుచీరల అమ్మకాలు తగ్గాయి. ప్రభుత్వం సొసైటీల ద్వారా అన్ సీజన్‌లోనూ పట్టు ఉత్పత్తులను కొనుగోలు చేసేలా చర్యలు చేపడితే ప్రయోజనం ఉంటుంది. వ్యాపారులకు పరిశ్రమల శాఖ నుంచి రాయితీ రుణాలను అందివ్వాలి. అప్పుడు పరిశ్రమ గాడిలో పడుతుంది. చేనేత కార్మికులకు ముడిపట్టు రాయితీ తదితర ప్రోత్సాహకాలు ఇవ్వడం ద్వారా పట్టుచీరల ఉత్పత్తి పెరిగే అవకాశం ఉంది.

–రంగన అశ్వర్థనారాయణ, పట్టుచీరల వ్యాపారి, ధర్మవరం

ఇబ్బందికరంగా ఉంది



వ్యాపారం చాలా ఇబ్బందిగా ఉంది. చేనేత సంక్షోభం కారణంగా పట్టుచీరల ఉత్పత్తి తగ్గింది. అన్‌సీజన్‌తో లక్షలాది రూపాయలు పెట్టుబడి స్తంభించిపోయింది. ప్రభుత్వం స్పందించి పట్టుచీరలకు మార్కెటింగ్ సౌకర్యం కల్పించేందుకు చొరవ చూపాలి. పట్టుచీరల వ్యాపారులకు రాయితీలు ఇవ్వాలి.

–బీరే జయచంద్ర, పట్టుచీరల వ్యాపారి, ధర్మవరం

రేపు గుండుమలకు సీఎం చంద్రబాబు

- మధ్యాహ్నం 1.45 గంటలకు రాక
- షెడ్యూల్ ఖరారు చేసిన అధికారులు



సీఎం పర్యటన ఏర్పాట్లపై చర్చిస్తున్న మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ చేతన్ తదితరులు

మడకశిర: రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మడకశిర నియోజకవర్గ పర్యటన అధికారికంగా ఖరారైంది. గురువారం మధ్యాహ్నం 12.20 గంటలకు నంద్యాల జిల్లా శ్రీశైలం మండలం సున్నిపెంట నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరనున్న సీఎం... 1.45 గంటలకు మడకశిర మండలంలోని కే.గుండుమలకు చేరుకుంటారు. స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్‌లో స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులతో మాట్లాడతారు. 2.20 గంటలకు కే.గుండుమల గ్రామాన్ని చేరుకుంటారు. 2.20 నుంచి 3.20 గంటల వరకు ఎన్టీఆర్ భరోసా పింఛన్లను పంపిణీ చేస్తారు. అదే విధంగా మల్బరీ ప్లాంటేషన్, రేషం షెడ్‌ను ముఖ్యమంత్రి పరిశీలిస్తారు. 3.20 నుంచి 3.25 గంటల వరకు గ్రామంలోని కరియమ్మదేవి దేవాలయాన్ని సందర్శిస్తారు. 3.25 నుంచి సాయంకాలం 4.25 గంటల వరకు గ్రామ ప్రజలతో ముఖాముఖి అవుతారు. సాయంకాలం 4.35 గంటలకు హెలికాప్టర్‌లో పుట్టపర్తి ఎయిర్‌పోర్టుకు, అక్కడి నుంచి ప్రత్యేక విమానంలో విజయవాడకు బయలుదేరి వెళతారని అధికార వర్గాల తెలిపాయి.

సీఎం పర్యటన ఏర్పాట్ల పరిశీలన

మడకశిర రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు పర్యటనకు అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. మంగళవారం రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి పయ్యావుల కేశవ్, కలెక్టర్ చేతన్, ఎస్పీ వి.రత్న, జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, సబ్ కలెక్టర్ అపూర్వ భరత్, సమాచార, పౌర సంబంధాల శాఖ డైరెక్టర్ హిమాన్షు శుక్లా, స్థానిక ఎమ్మెల్యే ఎంఎస్ రాజు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి తదితరులు హెలిప్యాడ్, ప్రజా వేదిక ఏర్పాట్లను పరిశీలించారు. ఎస్సీ కాలనీలో గుర్తించిన పింఛన్ లబ్ధిదారుల ఇళ్లను పరిశీలించి వారితో మాట్లాడారు. అనంతరం మంత్రి కేశవ్ విలేకరులతో మాట్లాడారు. గురువారం గుండుమలలో నిర్వహించనున్న ప్రజావేదిక ద్వారా ఈ ప్రాంత సమస్యలు, ప్రజల మనోభావాలను ముఖ్యమంత్రి చంద్రబాబు తెలుసుకుంటారన్నారు. అందుకు అనుగుణంగా భవిష్యత్‌లో ప్రభుత్వ విధానాలు రూపకల్పన చేస్తారన్నారు. మంత్రి వెంట డీఈఓ మీనాక్షి, డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి ఉన్నారు.

‘సూపర్ సిక్స్’పై మాటమార్చడం సిగ్గుచేటు

- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాల్సిందే
- లేదంటే ప్రజలతో కలిసి పోరాడతాం
- మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

పరిగి: ‘సూపర్ సిక్స్’ పథకాలను ప్రజలకు ఆశ చూపి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ...50 రోజుల్లోనే పథకాలను అమలు చేయలేమని చేతులెత్తిందని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ మండిపడ్డారు. మంగళవారం ఆమె పరిగి మండలంలోని శ్రీరంగరాజుపల్లి గ్రామంలో నిర్వహించిన దండు మారెమ్మ అమ్మవారి జ్యోతుల మహోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామ దేవత దండు మారెమ్మకు జ్యోతులు సమర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. ‘సూపర్ సిక్స్’ చూస్తే భయమేస్తోందని స్వయానా ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పడం చూస్తే ఆ పథకాలన్నింటినీ అటకెక్కించేందుకు సిద్ధమైనట్లు తెలుస్తోందన్నారు.



మాట్లాడుతున్న మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు ఖజానాలో కేవలం రూ.100 కోట్లు మాత్రమే ఉండేదని, అయినా అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చారన్నారు. గడిచిన ఐదేళ్లలో రూ. 2.71 లక్ష కోట్లతో పథకాలను అందించారని గుర్తు చేశారు. టీడీపీ అధికారంలోకి వచ్చే నాటికి ఖజానాలో రూ.7,500 కోట్లు ఉన్నప్పటికీ పథకాలను అమలు చేయడంలో విఫలుమైందన్నారు. ఓటాన్ అకౌంట్ బడ్జెట్ ప్రవేశపెట్టినప్పుడే ఈ ప్రభుత్వ డొల్లతనం బయటపడిందన్నారు. బడ్జెట్‌లో కనీసం ఏడాది ఖర్చులపై స్పష్టత ఇవ్వలేని దుస్థితిలో ఈ ప్రభుత్వం ఉందన్నారు. రాష్ట్ర గవర్నర్ చేత మాత్రం పది లక్షల కోట్ల బడ్జెట్ అని చెప్పిస్తున్నారని మండిపడ్డారు.

రైతులను ముంచొద్దు బాబూ

వైఎస్సార్ సీపీ అధికారంలో ఉన్నప్పుడు ఏటా ఖరీఫ్ సీజన్ ప్రారంభంలోనే రైతు భరోసా సొమ్ము నేరుగా ఖాతాల్లో జమ అయ్యేదని, దీంతో పెట్టుబడులకు రైతులు ఎవరి వద్దా చేయి చాచాల్సిన అవసరం లేకుండా పోయిందన్నారు. అలాగే ఆర్బీకేల ద్వారా విత్తనాలు, ఎరువులను సబ్సిడీతో అందించినట్లు గుర్తు చేశారు. కానీ చంద్రబాబు ఎన్నికల ముందు రైతులకు ఏటా రూ.20 వేలు ఇస్తామని గొప్పగా చెప్పి నేటికీ ఆ విషయం గురించి మాట్లాడటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. హామీ మేరకు చంద్రబాబు సూపర్ సిక్స్ పథకాలన్నీ పక్కాగా అమలు చేయాలని, లేని పక్షంలో ప్రజా పక్షాన పోరాడతామన్నారు.

జలం..కలుషితం

వర్షాకాలం.. నీరు కలుషితమయ్యే అవకాశం ఎక్కువగా ఉండే సమయం. అందుకే తాగునీటి సరఫరాపై అటు గ్రామ, ఇటు మున్సిపల్ అధికారులు ప్రత్యేక శ్రద్ధ చూపుతారు. క్లోరినేషన్‌తో పాటు నీటి శుద్ధిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుంటారు. కానీ ధర్మవరంలో తాగునీటి సరఫరాపై పర్యవేక్షణ కరువైంది. ఫలితంగా కలుషితనీరు నేరుగా కుళాయిల్లో వస్తుండగా..వాటిని తాగిన జనం రోగాల బారిన పడుతున్నారు.

- ధర్మవరంలో 25 రోజులుగా కలుషిత నీరు సరఫరా
- అనారోగ్యాలకు గురవుతున్న పట్టణ ప్రజలు
- సమస్య చెప్పినా పట్టించుకోని అధికారులు



దుర్గానగర్‌లోని ఓ ఇంటికి సరఫరా చేసిన నీరు (ఇన్‌సెట్‌లో) రాజేంద్రనగర్‌లోని ఓ ఇంటిలో రంగుమారిన నీరు

ధర్మవరం అర్బన్: మున్సిపాలిటీ పరిధిలో 40 వార్డులున్నాయి. దాదాపు 40 వేలకుపైగా ఆవాసాలున్నాయి. రోజు మున్సిపల్ అధికారులు తాడిమర్రి మండలం పార్నపల్లి రిజర్వాయర్ నుంచి పైపులైను ద్వారా ధర్మవరం పట్టణంలోని తిక్కస్వామినగర్ వద్దనున్న వాటర్ పంప్‌హౌస్‌కు నీటిని సరఫరా చేస్తారు. పంప్‌హౌస్‌లో క్లోరినేషన్ చేయడంతో పాటు ఆలం కలుపుతారు. గతంలో ఈ ప్రక్రియ పక్కాగా జరిగేది. ఏ మాత్రం తేడా వచ్చినా అప్పటి ఎమ్మెల్యే ఊరుకునేవారు కాదు. కానీ ప్రస్తుతం తాగునీటి సరఫరా గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. దీంతో 25 రోజులుగా పంప్‌హౌస్‌కు కలుషితనీరు వస్తోంది. ఆ నీటిని శుద్ధి చేయక పోవడంతో నీరంతా మట్టి రంగులో కనిపిస్తోంది. ఇదే నీటిని నేరుగా పట్టణానికి సరఫరా చేస్తున్నారు. దీంతో ఆ నీటిని తాగిన ప్రజలు అనారోగ్యానికి గురవుతున్నారు.

చర్మ వ్యాధులకు ఆస్కారం

కలుషిత నీటితో స్నానం చేసినా, ఆహార పదార్థాలు వండినా...ఇబ్బందేనని వైద్యులు చెబుతున్నారు. ప్రస్తుతం ధర్మవరంలో ప్రతి ఇంట్లోనూ మున్సిపల్ నీటినే వాడుతున్నారు. స్నానానికి, వంటకు ఇతర అవసరాలకు ఆ నీటినే వాడుకుంటున్నారు. మట్టి రంగులో ఉన్న నీటితో స్నానం చేయడం వల్ల శరీరంపై దద్దర్లు తదితర స్కిన్ అలర్జీలు వస్తున్నాయి. ఆ నీటితో వండిన ఆహారం తినడం వల్ల డయేరియా ప్రబలుతోంది. కలుషితమైన నీటిని ఉపయోగించడం వల్ల చర్మ వ్యాధుల వచ్చే ఆస్కారం ఉంటుందని, అలాగే అనేక రోగాలు దాడి చేస్తాయని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

అన్నం రంగు మారుతోంది



మున్సిపాలిటీ సరఫరా చేసే నీరు మట్టి రంగులో వస్తున్నాయి. ఆ నీటితో వంట చేస్తుంటే అన్నం కూడా రంగు మారుతోంది. ఆ అన్నం తిన్న వెంటనే కడుపు నొప్పితో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు తలెత్తుతున్నాయి. వెంటనే మున్సిపల్ అధికారులు స్పందించి స్వచ్ఛమైన నీటిని సరఫరా చేయాలి.

– జ్యోతి, గృహిణి, ధర్మవరం

దురదలు వస్తున్నాయి



మున్సిపాలిటీ సరఫరా చేస్తున్న నీటితో స్నానం చేస్తుంటే శరీరంపై దురదలు వస్తున్నాయి. కొంత మంది ఆ నీటితో చేసిన ఆహార పదార్థాలు తిన్న వారు డయేరియా బారిన పడి ఆస్పత్రుల్లో చేరారు. వైద్యానికి రూ.వేలు ఖర్చు చేసుకున్నారు. అధికారులు స్పందించి నీటిని శుద్ధి చేసి సరఫరా చేయాలి.

– శేఖర్, ధర్మవరం

నీటి మట్టం తగ్గింది

పార్నపల్లి రిజర్వాయర్‌లో నీటి మట్టం తగ్గింది. దీనికి తోడు గాలికాలం కావడంతో నీరు నిరంతరం కదులుతూ కలుషితమవుతోంది. ప్రస్తుతం నీరు రంగు మారడంతో పంప్‌హౌస్ వద్ద ఆలం, క్లోరిన్ కొంచెం ఎక్కువ వేస్తున్నాం. దీంతోపాటు పంపు రూమ్‌లలో ట్యాంకులనూ శుభ్రం చేయిస్తున్నాం. రిజర్వాయర్‌కు ఇన్‌ఫ్లో తగ్గడం వల్ల ఈ సమస్య వచ్చింది. చిన్న చిన్న పనులు పూర్తయితే రిజర్వాయర్‌లో నీటి మట్టం పెరుగుతుంది. అప్పుడు ఈ సమస్య ఉత్పన్నం కాదు.

– వీరేష్, వాటర్ వర్క్స్ డీఈ, ధర్మవరం మున్సిపాలిటీ

క్లుప్తంగా

వరుస చోరీలు



గుజరీ షాపులో దుండగులు ప్రవేశించిన మార్గాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ కృష్ణవేణి

గాండ్లపెంట: మండల కేంద్రంలో సోమవారం రాత్రి వరుస చోరీలు చోటు చేసుకున్నాయి. కదిరి – రాయచోటి ప్రధాన రహదారిలో మహమ్మద్ రఫీ నిర్వహిస్తున్న గుజరీ షాపులో రూ.60 వేలు విలువ చేసే ఐదు విద్యుత్ మోటార్లు, రాగి, సిల్వర్ తీగలు, ఇత్తడి సామగ్రి, కటింగ్ మిషన్లను అపహరించుకెళ్లారు. అలాగే జీనులకుంట రహదారిలో డాక్టర్ హైదర్‌వలి ప్రైవేట్ క్లినిక్‌లో రెండు ఖాళీ గ్యాస్ సిలిండర్లు ఎత్తుకెళ్లారు. అనంతరం ఓ మహిళ ఇంట్లోకి చొరబడి బీరువా తెరిచేందుకు విఫలయత్నం చేశారు. బాధితుల ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ కృష్ణవేణి దర్యాప్తు చేపట్టారు.

బంగారు నగల అపహరణ

పావగడ: స్థానిక విద్యానగర్‌లో నివాసముంటున్న న్యాయవాది రంగనాథ్ ఇంట్లో చోరీ జరిగింది. పావగడ తాలూకాలోని జాజురాయన హళ్లికి చెందిన ఆయన విద్యానగర్‌లో నివాసముంటూ న్యాయవాద వృత్తిలో కొనసాగుతున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఇంటికి తాళం వేసి తన సొంతూరుకు వెళ్లారు. అక్కడి నుంచి నేరుగా కోర్టుకెళ్లి మధ్యాహ్నం ఇంటికి చేరుకున్నారు. అప్పటికే తాళం బద్ధలుగొట్టి తలుపులు తీసి ఉన్నాయి. లోపలికెళ్లి పరిశీలిస్తే బీరువాలోని వస్తువులన్నీ చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. బీరువాలో దాచిన రూ.6 లక్షల విలువైన బంగారు నగలు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు నిర్ధారించుకున్న ఆయన ఫిర్యాదు మేరకు పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

సమయ పాలన పాటించకపోతే చర్యలు : డీఈఓ



రికార్డులు పరిశీలిస్తున్న డీఈఓ మీనాక్షి

మడకశిర రూరల్: సమయపాలన పాటించకపోతే చర్యలు తప్పవని కేజీబీవీ ఉపాధ్యాయులను డీఈఓ మీనాక్షి హెచ్చరించారు. మంగళవారం గుండుమలలోని కేజీబీవీని ఆమె తనిఖీ చేశారు. పలు రికార్డులు, వంట గది, తరగతి గదుల్లో పరిశుభ్రతను పరిశీలించారు. భోజనం నాణ్యత, బోధన తీరుపై విద్యార్థులతో ఆరా తీశారు. పదో తరగతి విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆమె వెంట ఎంఈఓ భాస్కర్, ఉపాధ్యాయులు, ఎమ్మార్సీ సిబ్బంది ఉన్నారు.

భూసారం తేలేదెలా?

- ఈ ఏడాది ఉమ్మడి జిల్లాకు 35,800 మట్టి నమూనాల సేకరణ లక్ష్యం
- టార్గెట్లు ఇచ్చి ఒత్తిడి చేయడంతో ఇష్టారాజ్యంగా మట్టి సేకరణ
- నిబంధనలకు తిలోదకాలిచ్చిన ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు



భూసార పరీక్ష కేంద్రం ఎదుట పడేసిన మట్టి నమూనాలు

అనంతపురం అగ్రికల్చర్: వ్యవసాయశాఖ చేపట్టిన మట్టి పరీక్షల ఫలితాలు వెల్లడైనా... ఇందులో కొన్ని ఫలితాల భూసారం ఏ గ్రామానికి చెందినది... ఏ రైతు పొలంలోనిది అనేది మాత్రం తేలకుండా పోతోంది. ఒక్కొక్కరు నాలుగు రోజుల్లో 40 మట్టి నమూనాలు సేకరించి భూసార పరీక్షా కేంద్రానికి పంపాలని టార్గెట్లు విధించడంతో రైతు సేవా కేంద్రాల (ఆర్‌ఎస్‌కే) ఇన్‌చార్జ్‌లు కొందరు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. నిబంధనలకు తిలోదకాలిచ్చి చాలా మంది తమ పరిధిలో నాలుగైదు పొలాల నుంచి 20 నుంచి 30 వరకు శ్యాంపిల్స్ సేకరించి, అనంతపురంలోని భూసార పరీక్ష కేంద్రానికి పంపారు.

కనిపించని ఊరూ.. పేరు

ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు సేకరించి పంపిన మట్టి నమూనా ప్యాకెట్లపై సంబంధిత రైతు పేరు, ఏ గ్రామం, ఇతర సమాచారం పేర్కొనకపోవడం గమనార్హం. ఇలాంటి నమూనాలకు సంబంధించి నిర్వహించిన పరీక్షల ఫలితాల వల్ల పెద్దగా ప్రయోజనం ఉండదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. మట్టి నమూనాల సేకరణపై అవగాహన కల్పించకపోవడం, అవగాహన ఉన్నా... సేకరణకు సమయం ఇవ్వకపోవడం లాంటి కారణాలతో ఆర్‌ఎస్‌కే ఇన్‌చార్జ్‌లు ఇష్టారాజ్యంగా వ్యవహరించినట్లు తెలుస్తోంది. విధించిన టార్గెట్ల మేరకు రైతుల పొలాల్లోని మట్టిని సేకరించి ప్రయోగశాలలకు పంపారు. కానీ, వాటిపై పూర్తి స్థాయి వివరాలు పేర్కొనకపోవడంతో పరీక్షలు నిష్ప్రయోజనమయ్యాయి.

35,800 నమూనాల సేకరణ

ఈ ఏడాది ఉమ్మడి జిల్లాకు సంబంధించి మొత్తం 35,800 మట్టి నమూనాలు సేకరించి ప్రయోగశాలలో పరీక్షించాలని దిశా నిర్దేశనం చేశారు. ఇందులో అనంతపురానికి 18,600, శ్రీసత్యసాయి జిల్లాకు 17,200 మట్టి నమూనాలు సేకరించాలని లక్ష్యంగా నిర్దేశించారు. సేకరించిన మట్టి నమూనాల్లో పోషకాలకు సంబంధించి 12 రకాల పరీక్షలు నిర్వహిస్తారు. ఇందులో పీహెచ్ (భూమి స్థితి) శాతం, ఎలెక్ట్రికల్ కండక్టర్ (ఈసీ), ఆర్గానిక్ కర్బన్ (ఓసీ), నైట్రోజన్ (ఎన్), ఫాస్ఫరస్ (పీ), పొటాష్ (కే), సల్ఫర్, బోరాన్, ఐరన్, కాపర్, జింక్, మాంగనీస్ లాంటి స్థూలపోషకాలు (మ్యాక్రో న్యూట్రియంట్స్), సూక్ష్మపోషకాల (మైక్రో న్యూట్రియంట్స్) శాతం విశ్లేషించి వాటి ఫలితాల ఆధారంగా సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించేలా రైతులకు కార్డులు అందజేస్తారు. అయితే టార్గెట్లు ఇచ్చే నాటికే ఖరీఫ్ పంటల సాగు కొనసాగుతోంది. పంటల సాగు సమయం, వర్షాలు పడే కాలంలో మట్టి నమూనాలు సేకరించినా సరైన ఫలితాలు రావని అధికారులు చెబుతున్నారు. మట్టి నమూనా సేకరించాలంటే దానికి ఒక పద్ధతి ఉన్నా... అది ఎక్కడా పాటించలేదని తెలుస్తోంది.

మట్టి సేకరణలో జాగ్రత్తలివే...

- పంట కోత తర్వాత వేసవిలో, లేదా పంటలు లేని సమయంలో మట్టి నమూనాలు సేకరించాలి.
- చెట్ల కింద, గట్ల కింద, పంట కాలువలు, కాలిబాటల్లో నమూనాలు సేకరించకూడదు.
- పశువుల ఎరువు, కంపోస్టు కుప్పలు ఉన్న చోట తీయకూడదు.
- సారవంతమైన ప్రాంతాల్లో కూడా మట్టి తీయకూడదు.
- చౌడు భూములు, ఇతర సమస్యాత్మక భూముల్లో విడివిడిగా నమూనాలు తీయాలి.
- రసాయన ఎరువులు వేసిన నెల రోజుల వరకూ మట్టి సేకరణ చేయకూడదు.
- నీరున్న చోట, బురదగా ఉన్న చోట కూడా తీయకూడదు.
- పైరు పొలంలో ఉన్నప్పుడు తీయాల్సి వస్తే వరుసల మధ్యలో నమూనాలు సేకరించాలి.
- నేల నిర్మాణం, రంగు, మురుగు పారుదల సౌకర్యం, నేల వాలు, చౌడు, క్షార, ఆమ్ల గుణాలు, పంటల సరళి తదితర విషయాలలో ఏవైనా తేడాలు కనిపిస్తే అన్ని రకాల నమూనాలు ఆ పొలం నుంచే తీయాలి.
- పొలంలో ఉన్న గడ్డి, చెత్త, కలుపు మొక్కలు తీసేసి, 'వి' ఆకారంలో పార లేదా అగర్‌తో గోతులు తీయాలి. గొయ్యి అంచుల నుంచి పారతో గాని, తాపీతో గాని మట్టిని సేకరించాలి. పొలంలో 8 నుంచి 10 ప్రాంతాల్లో పై పద్ధతిలో మట్టిని సేకరించాలి. అనంతరం ఆ మట్టినంతటిని కలిపి నేల మీద పరచి దానిని నాలుగు భాగాలుగా చేయాలి. మూలలకు ఎదురుగా ఉన్న భాగాల మట్టిని తీసుకుని మిగిలిన మట్టిని పారవేయాలి. ఇలా సేకరించిన అర కిలో మట్టి నమూనాను గుడ్డ సంచి లేదా పాలిథీన్ సంచిలో నింపి అందులో రైతు పేరు, చిరునామా, సర్వే నెంబరు, పొలం విస్తీర్ణం, సాగు చేస్తున్న పంటలు, సేకరించిన తేదీ తదితర వివరాలు జత చేసి భూసార పరీక్షా కేంద్రానికి పంపాలి.

అకట్టుకున్న 'వారసత్వ నడక'



హెరిటేజ్ వాక్‌లో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

లేపాక్షి: పర్యాటక కేంద్రమైన లేపాక్షిలో కేంద్ర పర్యాటక శాఖ ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం వారసత్వ నడక (హెరిటేజ్ వాక్) నిర్వహించారు. పర్యాటక, పురావస్తు శాఖలు సంయుక్తంగా చేపట్టిన ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. స్థానిక ఓరియంటల్ పాఠశాల వద్ద ప్రారంభమైన వారసత్వ నడక నంది విగ్రహం, వీరభద్రస్వామి దేవాలయం వరకూ కొనసాగింది. కేంద్ర పర్యాటక శాఖ (హైదరాబాద్) సహాయ సంచాలకులు ఆర్.కృపాకర్, చరిత్ర పరిశోధకుడు మైనాస్వామి మాట్లాడుతూ.. వీరభద్రస్వామి ఆలయం, నంది విగ్రహం విశేషాలు, విజయనగర సామ్రాజ్య శిల్ప శైలీ తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో కేంద్ర పర్యాటక సమాచారాధికారి ప్రవీణ్, పురావస్తు శాఖ అధికారి బాలకృష్ణారెడ్డి, ఓరియంటల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గిరి, బాలాజీ కళాశాల అధ్యాపకుడు గురుమేఘ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని ఏమార్చి నగల అపహరణ

సోమందేపల్లి: వృద్ధురాలిని ఏమార్చి, ఆమె నగలను అపహరించుకెళ్లిన ఘటన సోమందేపల్లిలో కలకలం రేపింది. వివరాలు... స్థానిక సాయినగర్‌లో నివాసముంటున్న వృద్ధురాలు హమ్మినిబాయి ఇంటి వద్దకు మంగళవారం ఉదయం ఓ దుండగుడు చేరుకున్నాడు. ఆధార్ కార్డు అప్‌డేట్ చేయించుకుంటే నిత్యావసర సరుకులు అందుతాయని తెలిపాడు. దుండగుడి మాటలు నమ్మిన ఆమె తన ఆధార్ కార్డ్‌ను తీసుకొచ్చి చూపించింది. దానిని అప్‌డేట్ చేస్తానని, శరీరంపై నగలు తీసి పక్కన పెట్టాలని తెలిపాడు. దీంతో ఆమె తన శరీరంపై ఉన్న బంగారు నగలు తీసి పక్కన పెట్టింది. అదే సమయంలో ఆమె దృష్టి ఏమార్చి నగలు తీసుకుని దుండగుడు ద్విచక్ర వాహనంపై ఉడాయించాడు. తాను మోసపోయానని గుర్తించిన వృద్ధురాలు చుట్టుపక్కల వారి సాయంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు, ఆ ప్రాంతంలోని సీసీ కెమెరాల పుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టారు.

విద్యుదాఘాతంతో యువకుడి మృతి



మృతుడు సాంబశివ

కొత్తచెరువు: విద్యుత్ షాక్‌కు గురై మండలంలోని లోచర్ల గ్రామానికి చెందిన తలారి సాంబశివ(32) మృతి చెందాడు. మెకానిక్ పనులతో పాటు విద్యుత్ సమస్యల పరిష్కారానికి హెల్పర్‌గా వెళుతూ జీవనం సాగిస్తున్న ఆయనకు ఇటీవలే వివాహమైంది. మంగళవారం ఉదయం చెన్నేకొత్తపల్లి మండలం వెంకటాంపల్లికి చెందిన రైతు ఫోన్ చేయడంతో ఆయన పొలంలో మోటార్ మరమ్మతు కోసం వెళ్లాడు. స్తంభం పైకి ఎక్కి మరమ్మతు చేస్తుండగా 11 కేవీ విద్యుత్ లైన్ తగిలి షాక్‌కు గురై కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

అంతర్రాష్ట్ర ద్విచక్ర వాహన దొంగల అరెస్ట్

ఎన్‌పీకుంట: ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లే అంతర్రాష్ట్ర ముఠా సభ్యులను అరెస్ట్ చేసినట్లు ఎస్‌ఐ శ్రీధర్ తెలిపారు. మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను ఆయన వెల్లడించారు. మండెంవారిపల్లి క్రాస్ వద్ద మంగళవారం ఉదయం వాహనాల తనిఖీ చేస్తున్న సమయంలో అదే గ్రామం నుంచి స్కార్పియో వాహనం, 4 ద్విచక్ర వాహనాల్లో వస్తున్న కొందరు పోలీసులను చూసి, వాహనాలను వదిలి పారిపోయారు. అప్రమత్తమైన పోలీసులు వెంటనే వారిని వెంటాడి ముగ్గురిని అదుపులోకి తీసుకున్నారు. అన్నమయ్య జిల్లా గాలివీడు మండలం ఎగువమూలపల్లికి చెందిన యోగీశ్వరనాయుడు, కర్ణాటకలోని హసకల్ తాలూకా సర్జాపురా నివాసి వి.సునీల్ కుమార్, ఉస్కర్ గ్రామానికి చెందిన ఎం.చిన్నరాజ్, బెంగుళూరులోని బొమ్మనహళ్లికి చెందిన ఆల్బర్ట్, చిత్తూరు జిల్లా నివాసి హేమచంద్ర ఓ ముఠాగా ఏర్పడి ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్లి, తక్కువ ధరతో విక్రయించి సొమ్ము చేసుకునేవారు. ఈ ముఠాకు నాయకుడిగా యోగీశ్వరనాయుడు వ్యవహరించేవాడు. ఈ క్రమంలో ఈ నెల 29న తెల్లవారుజాము 3 గంటల సమయంలో ముఠా సభ్యులను తన స్కార్పియో వాహనంలో యోగీశ్వరరెడ్డి పిలుచుకెళుతూ ఎన్‌పీ కుంట మండలం కొట్టంవారిపల్లిలో రోడ్డు పక్కన ఇంటి ఎదుట ఆపిన ద్విచక్ర వాహనాన్ని అపహరించుకెళ్లే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో ఇంట్లో వారు బయటకు రావడంతో ఇనుప రాడ్లు చూపి చంపుతామని బెదిరించారు. దీంతో కుటుంబ సభ్యులు కేకలు వేయడంతో వారు అక్కడి నుంచి పరారవుతూ మండెంవారిపల్లి క్రాస్ వద్ద పోలీసులకు పట్టుబడ్డారు. నిందితుల్లో ఇద్దరు పరారయ్యారు. కొట్టంవారిపల్లిలో చోరీ చేసిన ద్విచక్రవాహనానికి సంబంధించి బాధితుడి నుంచి ఫిర్యాదు స్వీకరించి, వాహనాన్ని అప్పగించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు.

'నిధులు రాగానే బకాయిలు చెల్లిస్తాం'

పుట్టపర్తి అర్బన్: ఇటీవల ముగిసిన సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు సంబంధించి రూ.68 లక్షల బకాయిలను ప్రభుత్వం చెల్లించాల్సి ఉందని, ఇందుకు సంబంధించి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు పుట్టపర్తి తహసీల్దార్ వేణుగోపాల్ తెలిపారు. ఈ మొత్తం రాగానే ఎన్నికల విధుల్లో పాల్గొన్న ప్రైవేట్ వాహన డ్రైవర్లు, భోజనాలు సరఫరా చేసిన హోటల్ యజమానికి అందజేస్తామని పేర్కొన్నారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ... పుట్టపర్తి నియోజకవర్గంలో ఎన్నికల నిర్వహణకు మొత్తం రూ.1.82 కోట్లు ఖర్చు అయిందన్నారు. ఇందులో ఇప్పటి వరకూ రెండు విడతల్లో రూ.1.14 కోట్లు అందాయన్నారు. వీటిని ఎన్నికల విధుల్లో పాల్గొన్న అధికారులు, బీఎస్‌ఎఫ్ బలగాల సౌకర్యాలకు, భోజనాలకు ఖర్చు చేసినట్లు వివరించారు. మిగిలిన రూ.68 లక్షలు బకాయిలు అందగానే మిగిలిన వారికి చెల్లిస్తామని పేర్కొన్నారు. అప్పటి వరకూ అందరూ సంయమనం పాటించి, సహకరించాలని కోరారు.

మాన్యం భూములకు రక్షణ కల్పించాలి

- ఎండోమెంట్ ఉప కమిషనర్ పట్టెం



ఉప కమిషనర్‌కు సమస్యలు వివరిస్తున్న ఈఓలు

అనంతపురం కల్చరల్: ఎండోమెంటు భూముల పరిరక్షణలో నిర్లక్ష్యం కూడదని, వెంటనే మాన్యం భూములకు రక్షణ కల్పించాలని సంబంధిత అధికారులను దేవదాయశాఖ రాయలసీమ జోన్ ఉప కమిషనర్ పట్టెం గురుప్రసాద్ ఆదేశించారు. అనంతపురంలోని మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వర కోదండరామాలయంలో మంగళవారం జరిగిన ఉమ్మడి జిల్లా ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్లు, ఈఓల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో సకాలంలో లీజు చెల్లించని కాంట్రాక్టర్ల నుంచి ఎండోమెంటు స్థలాలను, భూములకు ఏపీ దేవాదాయశాఖ సవరణ చట్టం ప్రకారం తక్షణమే రక్షణ కల్పించాలన్నారు. ఖాళీగా ఉన్న దేవాలయ భూములకు వెంటనే వేలం నిర్వహించాలన్నారు. పట్టణ, నగర ప్రాంతాల్లో ఉన్న భూములను గుర్తించి దీర్ఘకాలిక లీజుకు సంబంధించి వేలం ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపాలన్నారు. వివాదంలో ఉన్న భూములను తక్షణమే కోర్టు ఉత్తర్వుల ప్రకారం రిలీవ్ చేయాలని, కౌలు గుత్తలు చెల్లించని వారికి లీజు రద్దు నోటీసులు జారీ చేయాలని సూచించారు. కబ్జాకు గురైన దేవుని మాన్యాలను తిరిగి స్వాధీనం చేసుకుని రక్షణ కల్పించాలని ఆదేశించారు. అలాగే పబ్లికేషన్ అయి ప్రాపర్టీ రిజిస్ట్రేషన్ లేని దేవాలయాలకు వెంటనే రిజిస్ట్రేషన్ చేసి, సెక్షన్ 22 ఏ(1) సీ లిస్టుకు, సవరణ ప్రతిపాదనలు పంపాలన్నారు. చట్టపరమైన బకాయిలను వెంటనే చెల్లించేలా కృషి చేయాలన్నారు. సమావేశంలో అనంతపురం జిల్లా ఎండోమెంట్ అధికారి ఆదిశేషనాయుడు, శ్రీసత్యసాయి జిల్లా ఏసీ నరసింహరాజు, ఉభయ జిల్లాలోని అన్ని ఆలయాల ఈఓలు, ఎండోమెంట్ డివిజన్ ఇన్‌స్పెక్టర్లు, మండల ఇన్‌చార్జ్‌లు పాల్గొన్నారు.

చిరు వ్యాపారుల జీవనోపాధుల తొలగింపు

- మనస్తాపంతో ఓ వ్యాపారి ఆత్మహత్యాయత్నం



చికిత్స పొందుతున్న రాజ్‌బహుదూర్

కదిరి టౌన్: ఫుట్‌పాత్‌లపై వ్యాపారం చేసుకుంటున్న నిరుపేదల జీవనోపాధులను అధికారులు తొలగించారు. దీంతో మనస్తాపం చెందిన ఓ వ్యాపారి ఆత్మహత్యాయత్నం చేశాడు. వివరాలు... రెండు రోజులుగా కదిరి మున్సిపాలిటీ పరిధిలోని రహదారుల పక్కన వ్యాపారం చేసుకుంటున్న వారి దుకాణాలను అధికారులు తొలగిస్తూ వస్తున్నారు. మంగళవారం ఉదయం టవర్‌క్లాక్ ఎదురుగా తన టీ స్టాల్‌ను తొలగించే సమయంలో చిరువ్యాపారి రాజ్ బహదూర్ అధికారులను అడ్డుకున్నాడు. ఈ వ్యాపారంపైనే మొత్తం తన కుటుంబం ఆధారపడి జీవిస్తోందని, తమకు జీవనాధారమైన టీస్టాల్‌ను తొలగించరాదని అధికారులను వేడుకున్నాడు. అయినా అధికారులు వినకుండా టీస్టాల్‌ను తొలగించారు. దీంతో మనస్తాపం చెందిన రాజ్‌బహదూర్ పురుగుల మందు తాగాడు. విషయాన్ని గుర్తించిన అధికారులు వెంటనే ఆయనను స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఆయన పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిరువ్యాపారుల జీవనోపాధులకు అన్ని రకాలుగా సహకరిస్తూ వచ్చిందని, రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత తమ బతుకులు ఛిన్నాభిన్నమవుతున్నాయంటూ ఈ సందర్భంగా పలువురు చిరువ్యాపారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఎలాంటి నోటీసులు ఇవ్వకుండా ఉన్నఫళంగా బంక్‌లను తొలగిస్తుండడంతో బతుకు తెరువు కోల్పోతున్నామని వాపోయారు.

మెరుగైన సేవలు అందించాలి



గౌరవ వందనం స్వీకరిస్తున్న కమాండెంట్ మహేష్‌కుమార్

అనంతపురం: ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని హోంగార్డులకు రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్ పిలుపునిచ్చారు. ఎస్పీ కేవీ మురళీకృష్ణ ఆదేశాల మేరకు జిల్లాకు చెందిన హోంగార్డులు మంగళవారం పరేడ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మహేష్‌కుమార్... హోంగార్డుల గౌరవ వందనం స్వీకరించి మాట్లాడారు. శిక్షణలో నేర్చుకున్న అంశాలను ఎప్పుడూ గుర్తు చేసుకుంటూ విధులు నిర్వర్తించాలన్నారు. ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. ఇన్సూరెన్స్‌లు రెన్యూవల్ అవుతున్నది, లేనిది చూసుకుంటూ ఉండాలన్నారు. ఏదైనా సమస్య వస్తే సబ్ డివిజన్ ఇన్‌చార్జ్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలన్నారు. అనంతరం దర్బార్ నిర్వహించి హోంగార్డుల సమస్యలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆర్ఐ మధు, తదితరులు పాల్గొన్నారు.


మల్బరీ సాగు విస్తీర్ణం పెంపుపై దృష్టి సారించండి

అనంతపురం అగ్రికల్చర్: ఈ ఏడాది నిర్దేశించిన లక్ష్యం మేరకు 900 ఎకరాల్లో మల్బరీ (రేషం) సాగు విస్తీర్ణం పెంచేలా దృష్టి సారించాలని విలేజ్ సెరికల్చర్ అసిస్టెంట్ల (వీఎస్‌ఏ)ను జిల్లా పట్టుశాఖ అధికారి (డీఎస్‌ఓ) డి.ఆంజనేయులు ఆదేశించారు. మల్బరీ సాగు విస్తీర్ణం పెంపుపై మంగళవారం స్థానిక పట్టుశాఖ కార్యాలయంలో సెరికల్చర్ అధికారి ఓబులేసుతో కలసి వీఎస్‌ఏలతో సమీక్షించారు. తాజా పరిస్థితుల్లో నీటి వనరులు కలిగిన రైతులు రేషం పంట వేసుకోవడం వల్ల మంచి లాభాలు గడించవచ్చన్నారు. ఈ అంశంపై రైతులను చైతన్య పరచాలన్నారు. అలాగే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అందజేస్తున్న రాయితీలు, ప్రోత్సాహకాలను వివరించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు అదనంగా మరింత చేయూత ఉంటుందన్నారు. ఉపాధి హామీ పథకాన్ని కూడా వర్తింప జేసి ప్రయోజనాలు కలిప్తామన్నారు. ఎకరా విస్తీర్ణంలో మల్బరీ సాగుకు ముందుకు వచ్చే రైతులకు పుల్ల నాటుకునేందుకే రూ.22,500, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు రూ.27 వేలు అందిస్తామన్నారు. అలాగే చిన్న, పెద్ద సైజు షెడ్ల నిర్మాణం, నూట్ రేరింగ్ స్టాండ్, నేత్రికలు, ఇతర పోషకాలకు కూడా రాయితీలు వర్తిస్తాయన్నారు. వీటిపై రైతుల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పిస్తే సాగు విస్తీర్ణం పెరిగే అవకాశముంటుందన్నారు. సాగు విస్తీర్ణం గణాంకాలు తేల్చడానికి త్వరలో ఈ–క్రాప్ నమోదు ప్రక్రియ మొదలవుతుందన్నారు.

రైల్వే ఉద్యోగి ఇంట్లో చోరీ

గుంతకల్లు టౌన్: స్థానిక అరవిందనగర్ రైల్వే క్వార్టర్స్‌లో నివాసముంటున్న రైల్వే ఉద్యోగిని ఝాన్సీ నివాసంలో చోరీ జరిగింది. బాధితురాలు తెలిపిన మేరకు.. డీపీఓ కార్యాలయంలో పనిచేస్తున్న ఆమె సోమవారం సాయంత్రం డ్యూటీ నుంచి ఇంటికి వచ్చారు. అనంతరం ఇంటికి తాళం వేసి సమీపంలోని తన బంధువుల ఇంటికి వెళ్లారు. విషయాన్ని గుర్తించిన దుండగులు క్వార్టర్స్ వెనుక వైపు ప్రహరీపై దూకి ఇంటి తలుపులు బద్దలుగొట్టి లోపలకు ప్రవేశించారు. బీరువాలో భద్రపరిచిన 3 తులాల బంగారు నగలు, రూ.30 వేల నగదు, ఒక ల్యాప్‌టాప్‌ను అపహరించుకెళ్లారు. అదే రోజు రాత్రి ఇంటికి వచ్చిన ఆమె చోరీ విషయాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు మంగళవారం ఉదయం పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.


సూపర్ స్పెషాలిటీలో అరుదైన శస్త్రచికిత్స



ట్రాన్స్‌జెండర్ స్వాతితో ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేశ్వరరావు

అనంతపురం మెడికల్: సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి న్యూరో సర్జరీ విభాగం వైద్యులు మరో అరుదైన ఆపరేషన్‌తో ట్రాన్స్‌జెండర్ ప్రాణాలు కాపాడారు. వివరాలను మంగళవారం సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్యరావు, జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వరరావు వెల్లడించారు. ఈ నెల 25న ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో అందే సేవలపై ట్రాన్స్‌జెండర్లకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. సదస్సుకు హాజరైన ఉరవకొండకు చెందిన ట్రాన్స్‌జెండర్ స్వాతి మాట్లాడుతూ... తనకు నెల రోజుల క్రితం చోటు చేసుకున్న ప్రమాదంలో తలకు గాయమైందని, దీంతో తల తిరగడం, తలనొప్పితో బాధపడుతూ ప్రైవేట్ ఆస్పత్రికి వెళితే ఆపరేషన్‌కు రూ.6 లక్షల ఖర్చు అవుతుందని అక్కడి వైద్యులు తెలిపినట్లు పేర్కొంది. స్పందించిన డాక్టర్ కేఎస్‌ఎస్ వెంకటేశ్వర రావు, ఆర్‌ఎంఓ పద్మజ, డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ హేమలత ప్రత్యేక చొరవ తీసుకుని ఆమెను సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి రెఫర్ చేశారు. పరీక్షించిన వైద్యులు ఆమె తలకు గాయమైనప్పుడు మెదడులో రక్తస్రావమై గడ్డ కట్టినట్లుగా గుర్తించి, శస్త్రచికిత్సకు ఏర్పాట్లు చేశారు. న్యూరో సర్జరీ విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ నేతృత్వంలో డాక్టర్ సుబ్రమణ్యం (అనస్తీషియా, డిప్యూటీ సూపరింటెండెంట్), న్యూరో సర్జన్లు డాక్టర్ రవితేజ, డాక్టర్ భాస్కర్‌బాబు, ఎస్ఆర్‌లు డాక్టర్ అచ్యుత్, సీఎంఓ డాక్టర్ రీనా తదితరులు ఈ నెల 27న దాదాపు మూడు గంటల పాటు శ్రమించి స్వాతికి ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం ఆమె కోలుకుంటోంది. ఈ సందర్భంగా న్యూరో విభాగాధిపతి డాక్టర్ భాస్కర్ బృందాన్ని ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్లు అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థి మృతి



మృతుడు ధనుష్

గార్లదిన్నె: స్థానిక శింగనమల క్రాస్ సమీపంలో చోటు చేసుకున్న ప్రమాదంలో ఓ విద్యార్థి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన మేరకు... శింగనమల మండలం గురుగుంట్ల గ్రామానికి చెందిన ఆరుగురు కూలీలు వ్యవసాయ పనుల కోసం ఆటోలో గార్లదిన్నెకు బయలుదేరారు. గార్లదిన్నె శివారులోని శింగనమల క్రాస్ బ్రిడ్జి వద్దకు చేరుకోగానే రోడ్డుకు అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించే క్రమంలో డ్రైవర్ బ్రేక్ వేయడంతో ఆయన పక్కనే కూర్చొన్న ఇంటర్మీడియట్ విద్యార్థి వరికూటి ధనుష్(17) కింద పడ్డాడు. అదే సమయంలో విద్యార్థిపై ఆటో బోల్తాపడింది. ధనుష్‌తో పాటు ఇద్దరు కూలీలు గాయపడ్డారు. తీవ్రంగా గాయపడిన ధనుష్‌ను స్థానికులు వెంటనే అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే పరిస్థితి విషమించడంతో చికిత్సకు స్పందించక బాలుడు మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ మహమ్మద్ గౌస్ తెలిపారు.